www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 39 | | 16-7-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

## ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.2.19 లక్షల కోట్లకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, వారణాసి అభివృద్ధికి భారీ ఊతం
- ఎరువుల స్వయం సమృద్ధి.. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు నిర్ణయాలు

4



## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో గ్యాస్ సిలిండర్‌లు

- 10 నిమిషాల్లోనే ఇంటికి..
- హెచ్‌పీసీఎల్ వినూత్న సేవ
- దేశంలో తొలిసారిగా బెంగళూరులో ప్రారంభం

10 కేజీల నవ్య సిలిండర్లకు క్విక్ డెలివరీ

4



# పాలమూరు రైతులకు త్వరలోనే శుభవార్త



### పాలమూరు ఎత్తిపోతలకు త్వరలోనే మోక్షం

ఎత్తిపోతల ప్రాజెక్టు అనుమతులకు సీఎం హామీ
ఏపీ, కేంద్రంతో ముమ్మరంగా సంప్రదింపులు
డిండి ప్రాజెక్టు నీటి కేటాయింపులపై దృష్టి
దివిటిపల్లిలో అమర రాజా బ్యాటరీ ప్లాంట్ షురూ
స్థానిక యువతకే ఎక్కువ ఉద్యోగాలివ్వాలని పిలుపు

పాలమూరు జిల్లాలోని నిరుపేద రైతాంగానికి త్వరలోనే ఒక తీపి కబురు అందించబోతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. దశాబ్దాలుగా జిల్లా సాగునీటి అవసరాలను తీర్చేందుకు నిర్మిస్తున్న పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంపూర్ణ అనుమతులను సాధించే దిశగా కీలక అడుగులు పడుతున్నాయని వెల్లడించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో ఏర్పాటు చేసిన అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (జ్యూ) బ్యాటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా సీఎం మాట్లాడారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలను ఒప్పించి పూర్తి స్థాయి అనుమతులు తీసుకురావడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని, త్వరలోనే దీనిపై జిల్లా రైతులకు ఒక శుభవార్త వినబడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

*మహబూబ్‌నగర్, జూలై 15 (ఉద్యమ కెరటం):*

2



## దేశానికి తెలంగాణ రోల్‌మోడల్

- ఫ్యూచర్ సిటీతో ప్రపంచ దృష్టి హైదరాబాద్ వైపు
- 2047 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

2




## బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ గృహనిర్బంధం

- భీంగల్ అభివృద్ధి పనుల కోసం దీక్ష
- వేల్పూర్‌లోని నివాసంలో నిర్బంధం
- నియోజకవర్గంలో అరెస్టుల పర్వం
- 100 పడకల ఆసుపత్రి, సీసీ రోడ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్
- శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రభుత్వ రాక్షసత్వమేనని ఎమ్మెల్యే ఆగ్రహం
- పోలీసుల తీరుపై హరీశ్‌రావు ఫైర్

2

బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని భీంగల్ పట్టణ అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేపట్టిన ఒకరోజు కఠోర నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. వేల్పూర్‌లోని ఆయన నివాసంలోనే ఎమ్మెల్యేను హౌస్ అరెస్ట్ చేశారు.



## సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

3

- మంత్రి తుమ్మల
- సీతారామ, సీతమ్మసాగర్ పెండింగ్ అంశాలపై ఉత్తమ్‌తో సమీక్ష

## సర్ నమోదు గడువు పెంపు

ఆగస్టు 3 వరకు అవకాశం
ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ విడుదల
అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా

2




## పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ
- షాబాద్ ఘటనలో నిందితుడికి బెయిల్ రావడంపై ఆందోళన
- పోక్సో కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ఎస్ఓపీ, నిఘా విభాగాలు అవసరం
- 60 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సూచన
- నేర చరిత్ర గల నిందితులపై రౌడీషీట్లు తెరవాలని ప్రతిపాదన
- చర్యలపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక ఇవ్వాలని కోరిన పవన్

2





## అయోధ్య విరాళాల వివాదం

- 'నేను పారిపోయే వాడిని కాదు'
- ట్రస్ట్ కోశాధికారి స్పష్టీకరణ
- రూ. మూడు కోట్ల నగదు గోల్‌మాల్‌పై ఎస్‌బీఐపైనే విమర్శలు
- బంగారం మాయమైందన్న ప్రచారాన్ని ఖండించిన ట్రస్ట్

4

## హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ ఇంట్లో ఏసీబీ దాడులు

- రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తుల వెలికితీత
- 20 గంటల సోదాల అనంతరం రవీందర్ అరెస్ట్
- ప్లాట్లు, విల్లా, భవనం, భూములు.. భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం
- ఆస్తుల మూలాలు, కీలక ప్రాజెక్టుల ఆర్థిక లావాదేవీలపై లోతైన దర్యాప్తు



**హైదరాబాద్, జూలై 15:** హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్ నివాసంలో ఏసీబీ నిర్వహించిన విస్తృత సోదాల్లో రూ. 100 కోట్లకు పైగా విలువైన అక్రమాస్తులు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు 20 గంటల ..వివరాలు 2లో



## సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై పిల్

- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!
- వేగంగా క్షీణిస్తున్న కార్యకర్త ఆరోగ్యం
- ఇప్పటికే 8.5 కిలోల బరువు తగ్గినట్లు కోర్టుకు తెలిపిన పిటిషనర్
- తక్షణ వైద్య సహాయంపై నివేదిక ఇవ్వాలని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు ఆదేశం

4



# బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ గృహనిర్బంధం

## భీంగల్ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే దీక్ష

## వేల్పూర్‌లోని నివాసంలో వేముల నిర్బంధం..

**నిజామాబాద్/హైదరాబాద్, జూలై 15 (ఉద్యమ కెరటం):** బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని భీంగల్ పట్టణ అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేపట్టిన ఒకరోజు కఠోర నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. వేల్పూర్‌లోని ఆయన నివాసంలోనే ఎమ్మెల్యేను గృహనిర్బంధం చేశారు. ప్రజా సమస్యలపై తాను అహింసా మార్గంలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే, వందలాది మంది పోలీసులతో ఇళ్లను ముట్టడించి నిర్బంధించడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాక్షస చర్య అని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో 75 శాతం పనులు పూర్తి చేసుకున్న భీంగల్ 100 పడకల ఆసుపత్రి భవనాన్ని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వేముల డిమాండ్ చేశారు. వీటితో పాటు భీంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, నిలిచిపోయిన రూ. 12 కోట్ల సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలని, మూతపడిన భీంగల్ బస్ డిపోను పునఃప్రారంభించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసమే తాను చుక్క నీరు కూడా ముట్టకుండా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందన్నారు. భీంగల్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని తొలగించి, ఫ్లెక్సీలను చించేయడం ఘోరమన్నారు. తనను ఇంట్లో నిర్బంధించినా, జైల్లో పెట్టినా తన సత్యాగ్రహ దీక్ష ఎక్కడున్నా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పనులపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తే తక్షణమే దీక్ష విరమిస్తానని వేముల పేర్కొన్నారు. మరోవైపు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నిర్బంధాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. దీనిపై బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు హైదరాబాద్‌లో స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీంగల్ ప్రజల దశాబ్దాల కలల ప్రాజెక్టుల కోసం శాంతియుతంగా దీక్ష చేయాలనుకున్న ప్రజాప్రతినిధిని హౌస్ అరెస్ట్ చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. తమది 'ప్రజా ప్రభుత్వం' అని చెప్పుకుంటూ విపక్షాలపై ఉక్కుపాదం మోపడం, పోలీసు రాజ్యాన్ని నడపడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. హిట్లర్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించిన హరీశ్‌రావు.. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

# పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయండి

## సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

## షాబాద్ ఘటనలో నిందితుడికి బెయిల్ రావడంపై ఆందోళన

## పోక్సో కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ఎస్ఓపీ, నిఘా విభాగాలు అవసరం

## 60 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సూచన

## నేర చరిత్ర గల నిందితులపై రౌడీషీట్లు తెరవాలని ప్రతిపాదన

## చర్యలపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక ఇవ్వాలని కోరిన పవన్

**హైదరాబాద్, జూలై 15 (ఉద్యమ కెరటం):** చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాల నివారణకు, పోక్సో చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి కీలక లేఖ రాశారు. బాధితులకు వేగంగా న్యాయం అందించడంతో పాటు నిందితులకు కఠిన శిక్షలు పడేలా పలు ప్రతిపాదనలను అందులో పొందుపరిచారు. తెలంగాణలో ఇటీవల జరిగిన షాబాద్ ఘటనను లేఖలో ప్రస్తావించిన పవన్.. పోక్సో కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు ఏకంగా ఆరుగురిని దారుణంగా హత్య చేయడం తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఇలాంటి కేసులలో నిందితుల బెయిల్ పిటిషన్లను కోర్టులలో పోలీసులు మరింత కఠినంగా ప్రతిఘటించాలని, బాధితుల కుటుంబాలకు పటిష్ట భద్రత కల్పించాలని కోరారు. పోక్సో కేసులను విచారించే పోలీసు అధికారులకు బాలలతో సున్నితంగా వ్యవహరించడం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల సేకరణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పవన్ ప్రతిపాదించారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే బాధితులకు వైద్య పరీక్షలు పూర్తి చేసి నివేదికలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కేసుల్లో ప్రాథమిక విచారణ పేరిట ఆలస్యం చేయకుండా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ కేసులను 60 రోజుల్లో, సంక్లిష్టమైన కేసులను 90 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని, ఈ పెండింగ్ కేసులను జిల్లా ఎస్పీలు, రేంజ్ ఐజీలు ప్రతి నెల సమీక్షించాలని సూచించారు. బాధితుల రక్షణ కోసం ప్రతి కేసులోనూ ప్రత్యేక ప్రణాళిక ఉండాలని, అవసరమైతే పోలీసు పహారా కల్పించి వన్‌స్టాప్ సెంటర్లతో అనుసంధానం చేయాలని కోరారు. బెదిరింపులకు పాల్పడే నేర చరిత్ర గల నిందితులపై రౌడీషీట్లు తెరవాలని, పాఠశాలలు, హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లలో తప్పనిసరి రిపోర్టింగ్ వ్యవస్థను తీసుకురావాలని స్పష్టం చేశారు. పోక్సో కేసుల పర్యవేక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) విడుదల చేయడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారులపై జరిగే నేరాలను సాధారణ అంశంగా కాకుండా అత్యంత ప్రాధాన్యతతో చూడాలని స్పష్టం చేసిన పవన్.. ఈ చర్యల అమలుపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. పోక్సో అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందనే ఆశాభావాన్ని పవన్ కళ్యాణ్ వ్యక్తపరిచారు.

# పాలమూరు రైతులకు త్వరలోనే శుభవార్త

- ఎత్తిపోతల ప్రాజెక్టు అనుమతులకు సీఎం హామీ
- పాలమూరు ఎత్తిపోతలకు త్వరలోనే మోక్షం
- ఏపీ, కేంద్రంతో ముమ్మరంగా సంప్రదింపులు
- డిండి ప్రాజెక్టు నీటి కేటాయింపులపై దృష్టి
- దివిటిపల్లిలో అమర రాజా బ్యాటరీ ప్లాంట్ షురూ
- స్థానిక యువతకే ఎక్కువ ఉద్యోగాలివ్వాలని పిలుపు




**మహబూబ్‌నగర్, జూలై 15 (ఉద్యమ కెరటం):** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం ఎదురుచూస్తున్న రైతులకు త్వరలోనే శుభవార్త అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి అవసరమైన అనుమతులను కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. అలాగే డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపుపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ, కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న డిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా-నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు పొరుగు రాష్ట్రంతో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు అన్ని సాగునీటి పథకాలకు పూర్తి స్థాయి అనుమతులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడం తన బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాను పాలమూరు బిడ్డనని, వెనుకబడిన జిల్లాను రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్య, నీటిపారుదల, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న ముఖ్యమంత్రి, పాలమూరులో ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలు, ప్రతి నియోజకవర్గానికి నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలతో ప్రత్యేక విధానాలు రూపొందించామని, పర్యాటకం, ఇంధనం, వైద్యం, క్రీడా రంగాలకు కొత్త విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను పరిశ్రమలు గుర్తించాలని, స్థానిక యువతకే ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యం కల్పించాలని అమరరాజా సంస్థను కోరారు. పాలమూరులో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ వేలాది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీకి అత్యంత ప్రాధాన్యం ఏర్పడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 32 గిగావాట్ గంటల సామర్థ్యంతో అమరరాజా ఏర్పాటు చేసిన యూనిట్ దేశ పారిశ్రామిక రంగానికి కొత్త దిశ చూపుతుందని అన్నారు. సంస్థలో పనిచేస్తున్న 700 మంది ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం అభినందనీయమని కొనియాడారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీ పడుతున్న భారతీయ సంస్థగా అమరరాజా ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచ ఈవీ రంగంలో చైనా ఆధిపత్యానికి పోటీగా నిలిచే సామర్థ్యం అమరరాజాకు ఉందని, అలాంటి సంస్థలను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అమరరాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, ఎంపీ డీకే అరుణ, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశానికి తెలంగాణ రోల్‌మోడల్

- ఫ్యూచర్ సిటీతో ప్రపంచ దృష్టి హైదరాబాద్ వైపు
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన




**హైదరాబాద్, జూలై 15 (ఉద్యమ కెరటం):** రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ ఇంట్లో ఏసీబీ దాడులు

మొదటి పేజీ తరువాయి

పాటు సాగిన తనిఖీల అనంతరం రవీందర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. నానక్‌రాంగూడలోని రవీందర్ నివాసంతో పాటు మరో పది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు భారీ మొత్తంలో స్థిర, చరాస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయనను వైద్య పరీక్షల కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, తర్వాత నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయంలో విచారించారు. ప్రాథమిక విచారణలో రవీందర్ పేరుపై నార్సింగి, నానక్‌రాంగూడలో నాలుగు నివాస ప్లాట్లు, శంషాబాద్--కొత్తూరు ప్రాంతంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి, శంకర్‌పల్లి మోకిలాలో 300 చదరపు గజాల విస్తీర్ణంలో విల్లా, కొడంగల్, కిష్టాపూర్, పసుమాముల ప్రాంతాల్లో ఐదు ప్లాట్లు, కొండాపూర్ మజీద్‌బండలో నాలుగు అంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. అదనంగా నాలుగు కార్లు, రూ.4 లక్షల నగదు, రూ.45 లక్షల బ్యాంకు డిపాజిట్లు, 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 12.5 కిలోల వెండి, రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మూడు దశాబ్దాలుగా హెచ్‌ఎండీఏలో వివిధ హోదాల్లో పనిచేసిన రవీందర్, ఏడాది క్రితం చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీకాలంలో ఎలివేటెడ్ కారిడార్ల టెండర్లు, ఔటర్ రింగ్ రోడ్ లీజు వంటి కీలక ప్రాజెక్టులు నిర్వహించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల ద్వారా అక్రమంగా భారీ ఆస్తులు కూడబెట్టినట్లు అనుమానిస్తున్న ఏసీబీ అధికారులు, ఆస్తుల మూలాలు, బ్యాంకు లావాదేవీలు, బినామీ పెట్టుబడులు, ఇతర సంబంధిత అంశాలపై లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విచారణలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# సర్ నమోదు గడువు పెంపు

## ఆగస్టు 3 వరకు అవకాశం

## ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ విడుదల

## రాజకీయ పార్టీల విజ్ఞప్తితో పొడిగించిన గడువు

**హైదరాబాద్, జూలై 15 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. ఈ నెల 24తో ముగియాల్సిన ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను ఆగస్టు 3 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. అలాగే సవరించిన ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తూ సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి, అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై అవగాహన కొరవడి ఉండడం, గడువు ముగియడానికి ముందే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు గడువు పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాయి. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం, జూన్ 25 నుంచి కొనసాగుతున్న ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. ఇదే గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు కూడా పూర్తవుతాయి. ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. అనంతరం కొత్త ఓటర్ల నమోదు, పేర్లు చేర్చడం, తొలగించడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలకు సంబంధించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు స్వీకరిస్తారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులు, అభ్యంతరాలపై నోటీసులు జారీ చేసి విచారణలు నిర్వహించి, అక్టోబర్ 8 నాటికి పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం అధికారులకు ఆదేశించింది. అనంతరం అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

- కేంద్రంతో నిరంతర సంప్రదింపులు: మంత్రి తుమ్మల
- సీతారామ, సీతమ్మసాగర్ పెండింగ్ అంశాలపై ఉత్తమ్‌తో సమీక్ష
- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం
- కాలువలు, సొరంగాలు, భూసేకరణ, పైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలని నిర్ణయం



**హైదరాబాద్, జూలై 15(ఉద్యమ కెరటం):** అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలపై బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రక్రియ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాల కారణంగా నిలిచిపోయిందని తెలిపారు. ఈ న్యాయపరమైన చిక్కులను అధిగమించి అనుమతులు సాధించేందుకు కేంద్ర మంత్రులు, సంబంధిత శాఖలు, అధికారులతో అన్ని స్థాయిల్లో చర్చలు కొనసాగిస్తున్నామని చెప్పారు. అనుమతులు వచ్చిన వెంటనే ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్-1, పంప్‌హౌస్-2 మధ్య ఉన్న దోమలవాగు నిల్వ సామర్థ్యాన్ని 0.20 టీఎంసీల నుంచి 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై కూడా చర్చించినట్లు మంత్రి తెలిపారు. నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల ఎత్తిపోతల వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని వివరించారు. ఈ ప్రతిపాదనకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్-1, 2, 3 మధ్య అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్లు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. వరదల సమయంలో కాలువలకు నష్టం జరగకుండా నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఈ ఏర్పాట్లు దోహదపడతాయని అధికారులు వివరించారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తైందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. 2026 ఆగస్టు నాటికి పనులు పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని చెప్పారు. నిర్మాణ సంస్థలకు పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని తుమ్మల కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో సంప్రదాయ కాలువలకు బదులుగా పైపుల ద్వారా సాగునీటి పంపిణీ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జూలూరుపాడు సొరంగం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. పాలేరు జలాశయానికి వీలైనంత త్వరగా గోదావరి జలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించినట్లు తుమ్మల వెల్లడించారు. సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని పెండింగ్ అంశాలను సమన్వయంతో పరిష్కరించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులకు త్వరితగతిన సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇరువురు మంత్రులు స్పష్టం చేశారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా ఆషాఢ బోనాలు

- నేటి నుంచి బోనాల మహోత్సవాలు ప్రారంభం
- గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో వేడుకలకు శ్రీకారం
- ఉత్సవాల నిర్వహణకు రూ.20 కోట్లు.. అన్ని ఏర్పాట్లు పూర్తి
- అమ్మవారి కటాక్షంతో వర్షాభావం తొలగి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూలై 15 (ఉద్యమ కెరటం):** తెలంగాణ ఆత్మను, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఆషాఢ బోనాల ఉత్సవాలు రాష్ట్ర ప్రజల ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. జూలై 16 నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సుమారు మూడు వేలకుపైగా దేవాలయాల్లో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో వేడుకలు ప్రారంభమై, ఆగస్టు 13న హరిబౌలిలోని అక్కన్న-మాదన్న మహంకాళి ఆలయంలో బోనాల సమర్పణ, ఘటాల నిమజ్జనంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని, లౌకిక స్ఫూర్తిని చాటుతాయని మంత్రి అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.20 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించడం పట్ల మంత్రి కొండా సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు సౌకర్యవంతంగా అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి సురక్షితంగా తిరిగి స్వగృహాలకు చేరుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పొలాలు పచ్చగా కళకళలాడాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు.

# తుంగతుర్తి వ్యవహారంలో వేలు పెట్టను

**జగ్గారెడ్డితో మంత్రి కోమటిరెడ్డి భేటీ**

**గెలుపు లక్ష్యంగా పనిచేయాలని హితవు**

**హైదరాబాద్, జూలై15:** తుంగతుర్తిలో నెలకొన్న వివాదాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చూసుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోబోనని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని కోమటిరెడ్డి నివాసంలో ఆయనతో జగ్గారెడ్డి భేటీ అయ్యారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవుల విషయంలో నెలకొన్న వివాదంపై చర్చించారు. కోమటిరెడ్డితో భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి అంశంలో కలగజేసుకునేందుకు కోమటిరెడ్డి ఆసక్తి చూపించడం లేదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావాలంటే వరుసగా మూడేళ్లు పార్టీ కార్యకర్తగా కొనసాగాలనే ఏఐసీసీ నిబంధన ఉందన్నారు. తుంగతుర్తిలో మూడు, నాలుగు మండలాల్లో ఆ నిబంధనల ప్రకారం నియామకాలు జరగలేదన్నారు. ఈ వ్యవహారంపై ఈనెల 20లోపు నివేదిక ఇస్తానని తెలిపారు. ఇకపోతే చ్చే ఎన్నికల్లో తమ టా÷-గ్గ్ం÷ట్ 120 సీట్లని... దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ స్వీప్ చేస్తామని అన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. బుధవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి కోమటిరెడ్డి. రాహుల్ గాంధీ ప్రధాని కావడం తమ లక్ష్యమని... రాహుల్ గాంధీ గెలుపు కోసం అందరు కలిసి పని చేయాలని అన్నారు. కొంతమంది మంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్లారని... తాను మంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్లలేదని అన్నారు మంత్రి కోమటిరెడ్డి. తుంగతుర్తి విషయం అన్ని తెలిసిన వ్యక్తి జగ్గారెడ్డి చూసుకుంటారని.. లోకల్ ఎమ్మెల్యే అందరితో సమన్వయం చేసుకుంటాడని అన్నారు. .రోడ్ల మీదకు వచ్చి కొట్టుకోవద్దని... సమస్యలు ఉంటే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ దృష్టికి తేవాలని అన్నారు కోమటిరెడ్డి. 35ఏండ్ల నుండి ప్రజా జీవితంలో ఉన్నానని... 13వేల కోట్ల నిధులు,7వేల కోట్ల పంచాయితీ రాజ్ రోడ్లకు నిధులు తీసుకొచ్చానని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ లో రోడ్లు వేస్తున్నామని... గడ్కరీతో మాట్లాడి 2వేల కోట్ల సీఆర్‌ఎఫ్ ఫండ్స్ తెచ్చానని అన్నారు కోమటిరెడ్డి. జగ్గారెడ్డి రెడ్డి ని రాహుల్ గాంధీ ఇష్టపడతారని.. జగ్గారెడ్డి పేదల మనిషి,మాస్ లీడర్ అని... అందరికి సాయం చేస్తారని కొనియాడారు. సిద్దిపేట లో జగ్గారెడ్డి పోటీ చేస్తే పూర్తిగా తమ మద్దతు ఉంటుందని అన్నారు. హరీష్ రావు, రఘునందన్ రావు మీద రెండు వేల మెజారిటీ తో మాత్రమే గెలిచిందని అన్నారు.



## విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిరోధానికి
# కఠిన చర్యలు

**జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాల్సిందే**

**ఈగిల్ అధికారులకు డిజిపి ఆనంద్ సూచన**

**హైదరాబాద్, జూలై 15:** విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని ఈగల్ విభాగంలోని అధికారులకు తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డ్రగ్స్ నిరోధించడంపై బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఈగల్ అధికారులతో సి.వి. ఆనంద్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో 'యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కో ఆర్డినేటర్ నియామకం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతతోపాటు డ్రగ్స్ నివారణ చర్యలపై సేఫ్టీ కమిటీలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు, విద్య, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశించారు. విద్యార్థులకు సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ÷రిలీసు, విద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో డ్రగ్స్ రహిత తెలంగాణెలి లక్ష్యమని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ రహిత విద్యాసంస్థల కోసం త్వరలోనే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (÷ాక్షఖబ) విడుదల చేయనున్నారు. ప్రభుత్వానికి తుది ప్రతిపాదనలు సమర్పించే ముందు మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన**



**హైదరాబాద్, జులై 15(ఉద్యమ కెరటం):** ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ÷నైల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

## బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే
# లీగల్ నోటీసుకు కౌంటర్

**ఆరోపణలు నిరాధారమంటూనే క్షమాపణలు**



**న్యూఢిల్లీ:** బీజేపీ ఎంపీ డాక్టర్ నిషికాంత్ దూబే తరఫు న్యాయవాదులు రిషి కె. అవస్థీ, కృష్ణ కన్హయ్య పాల్ పంపిన లీగల్ నోటీసుకు ధీటుగా సమాధానం పంపారు. ఆ నోటీసులో పేర్కొన్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమని, చట్టపరంగా ఎక్కడా నిలవవని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్)లో చేసిన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా అవమానించాలనే ఉద్దేశంతో చేసినవి కావని సమాధానంలో పేర్కొన్నారు. సదరు లీగల్ నోటీసు అందే వరకు సంబంధిత వ్యక్తి గురించి తనకు ఎలాంటి వ్యక్తిగత పరిచయం కూడా లేదని స్పష్టం చేశారు. అయితే, తమ వ్యాఖ్యల వల్ల అనుకోకుండా ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే హృదయపూర్వకంగా క్షమాపణలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే సమయంలో ఈ క్షమాపణను చట్టపరమైన తప్పుగానో లేదా బాధ్యతను అంగీకరించినట్లుగానో ఎట్టి పరిస్థితుల్లోనూ భావించరాదని స్పష్టం చేశారు. ఈ వివాదానికి సంబంధించి తమకున్న అన్ని చట్టపరమైన హక్కులు భవిష్యత్తులో యథాతథంగా కొనసాగుతాయని, వాటిని రిజర్వ్ చేసుకుంటున్నట్లు సమాధాన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు.

## కాగజ్‌నగర్ బాలికపై సామూహిక అత్యాచారం కేసులో
# నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలి**

**నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు**



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్‌లో 11 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సాహెర బాను డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 9న ఘటన జరిగినప్పటికీ ఇప్పటి వరకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడం ఆందోళనకరమని అన్నారు. ఈ ఘటనతో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై పోలీసులను ప్రశ్నిస్తే విచారణ కొనసాగుతోందనే సమాధానం మాత్రమే వస్తోందని, ఇంత తీవ్రమైన ఘటనలో దర్యాప్తు ఎందుకు జాప్యం అవుతోందో స్పష్టత ఇవ్వాలని ఆమె కోరారు. ఘటన వెనుక ఏవైనా అసాంఘిక శక్తులు ఉన్నాయా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలపై సమాజం మౌనంగా ఉండరాదని, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సాహెర బాను పిలుపునిచ్చారు. చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులపై ఎన్‌కౌంటర్ చర్యలు చేపట్టాలని కూడా ఆమె డిమాండ్ చేశారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
గురువారం
16 జూలై 2026



# నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారం

### ఎల్‌నినో సవాళ్లకు జాతీయ జల విధానమే సమాధానం

### పార్లమెంట్‌లో రాజకీయాలకే కాదు.. నీటి భద్రతకూ ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు,సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్దతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వం-సగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వం-ర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్దాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి.

# ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.2.19 లక్షల కోట్లకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, వారణాసి అభివృద్ధికి భారీ ఊతం
- ఎరువుల స్వయం సమృద్ధి.. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు నిర్ణయాలు



**న్యూఢిల్లీ, జూలై 15(ఉద్యమ కెరటం):** దేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మొత్తం రూ.2,19,353 కోట్ల విలువైన ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. సెమీకండక్టర్ల తయారీలో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడం, మొబైల్ తయారీని విస్తరించడం, ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి సాధించడం, వారణాసిలో భారీ మౌలిక సదుపాయాల కల్పన, రైల్వే నెట్‌వర్క్ బలోపేతం వంటి నిర్ణయాలకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. భారత్‌ను అంతర్జాతీయ చిప్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సెమీకండక్టర్ మిషన్--2.0కు రూ.1,27,500 కోట్ల భారీ కేటాయింపును క్యాబినెట్ ఆమోదించింది. దీని ద్వారా దేశంలో అత్యాధునిక సెమీకండక్టర్ తయారీ, రూపకల్పన, ప్యాకేజింగ్ పరిశ్రమలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించనుంది. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేందుకు మొబైల్ ఫోన్ తయారీ ప్రోత్సాహక పథకంకు రూ.62,500 కోట్లను కేటాయించారు. ఈ పథకం అమలుతో దేశీయ మొబైల్ ఉత్పత్తి పెరగడంతో పాటు వేలాది ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యంగా యూరియా జాతీయ పెట్టుబడి విధానం--2026కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశీయ యూరియా ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. దీనికి ప్రత్యేక నిధుల కేటాయింపు లేకపోయినా విధానపరమైన అనుమతి లభించింది. వారణాసి నగర అభివృద్ధికి రూ.25,446 కోట్ల విలువైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వరుణా నది వెంబడి రూ.10,998 కోట్లతో ఆరు, నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్, గంగా నది వెంబడి రూ.14,448 కోట్లతో ఆరు లేన్ల అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా రెండు కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. పారాదీప్--హరిదాస్‌పూర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్లు, డాంగోవాపోసి-రాజ్‌ఖర్సవాన్ మార్గంలో నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు పారిశ్రామిక వృద్ధితో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ, రైతులకు ఎరువుల భద్రత, దేశీయ తయారీ సామర్థ్య పెంపు, ఉపాధి అవకాశాల సృష్టికి దోహదపడతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సెమీకండక్టర్, మొబైల్ తయారీ రంగాల్లో ఈ నిర్ణయాలు ప్రపంచ మార్కెట్లో భారతదేశ పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై పిల్




- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!
- వేగంగా క్షీణిస్తున్న సామాజిక కార్యకర్త ఆరోగ్యం
- ఇప్పటికే 8.5 కిలోల బరువు తగ్గినట్లు కోర్టుకు తెలిపిన పిటిషనర్
- తక్షణ వైద్య సహాయంపై నివేదిక ఇవ్వాలని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 15(ఉద్యమ కెరటం):** ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిరవధిక నిరాహార దీక్ష కారణంగా వేగంగా క్షీణిస్తుండటంపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన ప్రాణాలను కాపాడేందుకు తక్షణ వైద్య సహాయం అందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని న్యాయస్థానం అత్యవసరంగా విచారించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ ప్రభుత్వానికి హైకోర్టు కీలక నోటీసులు జారీ చేసింది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష కారణంగా ఆయన శరీరం తీవ్రంగా సహకరించడం లేదని, ఇప్పటికే దాదాపు 8.5 కిలోల బరువు తగ్గారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆయన ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, వైద్యుల పర్యవేక్షణలో అవసరమైతే బలవంతంగానైనా ద్రవాహారం (లిక్విడ్ డైట్) అందించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న పలు అవకతవకలకు వ్యతిరేకంగా సాగుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమానికి మద్దతుగా సోనమ్ వాంగ్‌చుక్ ఈ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. విద్యా రంగంలో సంస్కరణలు కోరుతూ ఆయన చేస్తున్న ఈ దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న నేపథ్యంలో, హైకోర్టు జోక్యం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది.

# అయోధ్య విరాళాల వివాదం

- 'నేను పారిపోయే వాడిని కాదు'
- ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి స్పష్టీకరణ
- రూ. మూడు కోట్ల నగదు గోల్‌మాల్‌పై ఎస్‌బీఐపైనే విమర్శలు
- బంగారం మాయమైందన్న ప్రచారాన్ని ఖండించిన ట్రస్ట్




**అయోధ్య, జూలై 15(ఉద్యమ కెరటం):** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల దుర్వినియోగం వ్యవహారంపై ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి మహారాజ్ స్పందించారు. ఈ వివాదం నేపథ్యంలో తాను రాజీనామా చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తాను ఎక్కడికీ పారిపోయే వ్యక్తిని కాదని, ఛత్రపతి శివాజీ మహారాజ్ అనుచరుడిగా సమస్యను ధైర్యంగా ఎదుర్కొంటానని, బాధ్యతల నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విరాళాల గోల్‌మాల్‌కు సంబంధించి అరెస్టయిన వారంతా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమించిన సిబ్బందేనని, వారి నియామకాలు, నేపథ్య పరిశీలన బాధ్యత బ్యాంకుదేనని ఆయన ఆరోపించారు. సుమారు రూ. మూడు కోట్ల మేర నగదు గోల్‌మాల్ జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నామని, అయితే అది బ్యాంకు ఖాతాల్లోని నిధులు కాదని, విరాళాల పెట్టెల్లో వచ్చిన నగదేనని వివరించారు. ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా పూర్తిగా స్వచ్ఛందమని, ఆయన వ్యవహారశైలిలో నిర్లక్ష్యం ఉన్నప్పటికీ బలిపశువుగా మార్చలేదని గోవింద్ దేవ్ గిరి పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బందికి జేబులు లేని యూనిఫాంలు అందించడం, సీసీటీవీ నిఘాను మరింత బలోపేతం చేయడం, విరాళాల నగదు లెక్కింపును ట్రస్ట్, బ్యాంకు అధికారుల సంయుక్త పర్యవేక్షణలో నిర్వహించడం వంటి కఠిన చర్యలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే రూ.1,400 కోట్ల విలువైన బంగారం మాయమైందన్న ప్రచారాన్ని పూర్తిగా ఖండించిన ఆయన, ఆ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది.

# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో గ్యాస్ సిలిండర్లు

- 10 నిమిషాల్లోనే ఇంటికి..
- దేశంలోనే తొలిసారిగా సరికొత్త సేవలు!



**బెంగళూరు, జూలై 15(ఉద్యమ కెరటం):** ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు రీఫిల్ బుక్ చేసుకుంటే డెలివరీ కావడానికి రెండు మూడు రోజులు పడుతోంది. అయితే, ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా కేవలం పది నిమిషాల్లోనే గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి చేరవేసే సరికొత్త విధానం త్వరలోనే బెంగళూరు వాసులకు అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ప్రముఖ క్విక్ కామర్స్ వేదిక 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్'తో ప్రభుత్వ రంగ చమురు సంస్థ 'హెచ్‌పీసీఎల్' కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా, హెచ్‌పీసీఎల్‌కు చెందిన 10 కేజీల 'నవ్య' సిలిండర్లను బుక్ చేసుకున్న 10 నిమిషాల్లోనే కస్టమర్ల ఇళ్లకు డెలివరీ చేయనున్నారు. గ్యాస్ కనెక్షన్ లేని వారు, చిన్న కుటుంబాలు, బ్యాచిలర్స్, విద్యార్థులకు అనువుగా ఉండేలా ఈ నవ్య గ్యాస్ సిలిండర్‌లను రూపొందించారు. సాధారణ స్టీల్ సిలిండర్‌ల కంటే భిన్నంగా, వీటిని అత్యాధునిక కాంపోజిట్ పాలిమర్‌తో తయారు చేశారు. పాక్షిక పారదర్శకంగా ఉండే ఈ సిలిండర్లలో గ్యాస్ ఎంత మిగిలి ఉందో బయటి నుంచే చూసి తెలుసుకోవచ్చు. పైగా, ఇవి సాధారణ స్టీల్ సిలిండర్ల కంటే 50 శాతం తక్కువ బరువు ఉంటాయి. త్వరితగతిన బుక్ చేసుకునే సదుపాయం ఉన్నప్పటికీ, భద్రతా ప్రమాణాల దృష్ట్యా ఈ సిలిండర్‌లను సాధారణ గ్యాస్ ఏజెన్సీలకు చెందిన నిపుణులైన సిబ్బంది ద్వారానే డెలివరీ చేయనున్నట్లు హెచ్‌పీసీఎల్ స్పష్టం చేసింది. మొదటి సారి బుక్ చేసుకునే కస్టమర్ల నుంచి అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న తర్వాతే సిలిండర్ కేటాయిస్తారు. ఆ తర్వాతి బుకింగ్‌లను రీఫిల్‌గా పరిగణిస్తారు. రీఫిల్ డెలివరీ తీసుకునే సమయంలో కస్టమర్లు తమ వద్ద ఉన్న ఖాళీ నవ్య సిలిండర్‌ను సిబ్బందికి తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. ఎల్‌పీజీ సిలిండర్‌లను మరింత సులభంగా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకే ఈ వినూత్న సేవలను ప్రారంభిస్తున్నట్లు హెచ్‌పీసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ అమిత్ గర్గ్ తెలిపారు. కాగా, ఈ సేవలను ఇతర నగరాలకు ఎప్పుడు విస్తరిస్తారనే వివరాలను సంస్థ ఇంకా వెల్లడించలేదు.

# జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు సన్రైజ్ అకాడమీ క్రీడాకారుల ఎంపిక



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 ఎంపిక పోటీల్లో ఇచ్చోడకు చెందిన సన్రైజ్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. బుధవారం నిర్మల్లో జరిగిన పోటీల్లో ఎనిమిది మంది యువ క్రికెటర్లు అత్యుత్తమ ప్రదర్శనతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్లో ఫజల్, యష్, త్రిషుల్, అయాజ్, ధనుష్, సందేశ్, వరుణ్, రుద్ర ఉన్నట్లు అకాడమి కోచ్ షేక్ అమాన్ తెలిపారు. వారి కృషి, క్రమశిక్షణ, నైపుణ్యం ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొననున్నట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

# గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యా సామగ్రి పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామీణ ప్రాంత గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఏకల్ అభియాన్ సంస్థ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నేరడిగొండ మండలంలోని గుత్పాల గ్రామ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏకల్ అభియాన్ సభ్యుడు ఉడుగుల అభిలాష్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రిని అందించడం ద్వారా వారిలో చదువుపై ఆసక్తి పెంపొందించడమే సంస్థ లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అడే అర్జున్, ఏకల్ టీచర్ కొట్నాక్ శారద, అంగన్వాడీ టీచర్ తిరుపతమ్మ, దావుల దినేష్, పెందూర్ భూమన్న, సంతోషిని, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాంకిడి గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించాలి



**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించి ఆధునిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి కోదురుపాక మహేష్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతమైన వాంకిడిలో వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నప్పటికీ, వారికి తగిన గ్రంథాలయ వసతులు లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ గ్రంథాలయం తాత్కాలిక భవనంలో కొనసాగుతోందని, భవనం ఇరుకుగా ఉండటంతో ఒకేసారి ఎక్కువ మంది విద్యార్థులు చదివే అవకాశం లేదన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, సరిపడా కుర్చీలు, టేబుళ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గ్రూప్స్, పోలీస్, ఉపాధ్యాయ, గ్రామపంచాయతీ, రెవెన్యూ, ఆరోగ్యశాఖ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్న నేపథ్యంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, దిన పత్రికలు, ఉద్యోగ సమాచార మ్యాగజైన్లు, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, మాక్ టెస్ట్ పేపర్లు గ్రంథాలయంలో అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే ఆన్లైన్ పరీక్షల కోసం కంప్యూటర్లు, హైస్పీడ్ ఇంటర్నెట్, డిజిటల్ లైబ్రరీ, ఉచిత వైఫై, ప్రత్యేక రీడింగ్ రూమ్, మహిళా విద్యార్థులకు ప్రత్యేక అధ్యయన గది, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ బ్యాకప్ వంటి ఆధునిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, వార్కోల్ రాకేష్, పుప్పిరి వెంకటేష్, స్థానిక విద్యార్థులు, నిరుద్యోగ యువత, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# వాగు దాటేదెలా.. ఊరు మారేదెలా?

- వర్షం పడితే ప్రయాణం నరకయాతన..!
- అభివృద్ధికి ఆమడదూరంలో పిప్పర్గొంది
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలంటూ గ్రామస్తుల విజ్ఞప్తి





**ఉద్యమ కెరటం, వాంకిడి :** స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, సాంకేతికతతో ప్రపంచం దూసుకుపోతున్నా.. ఆ గ్రామానికి మాత్రం కనీస మౌలిక సదుపాయమైన రహదారి భాగ్యం నోచుకోలేదు. వర్షం పడిందంటే చాలు, ఆ ఊరి ప్రజల ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని పిప్పర్గొంది గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న దశాబ్దాల నాటి రవాణా కష్టాలపై ప్రత్యేక కథనం.

### చెరువును తలపిస్తున్న రహదారి

వర్షాకాలం ప్రారంభమైందంటే పిప్పర్గొంది గ్రామస్తుల గుండెల్లో వణుకు మొదలవుతుంది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా బురదమయంగా మారి, కనీసం అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి చిన్న వర్షానికీ ఈ మార్గం చెరువును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.

### ప్రాణాలు పణంగా పెట్టి వాగులు దాటాల్సిందే..

గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగులు, ఒర్రెలు వర్షం సమయాల్లో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోతోంది. గ్రామం దాటి బయటకు వెళ్లిన వారు, బయట నుంచి గ్రామానికి వచ్చేవారు గంటల తరబడి వాగుల అవతలే వేచి చూడాల్సి వస్తోంది. కొన్నిసార్లు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఉధృతంగా ప్రవహించే వాగులను దాటాల్సిన దుస్థితి నెలకొంది.

### ఆర్థికంగా కుదేలవుతున్న రైతాంగం

కేవలం వైద్యం, విద్యే కాకుండా గ్రామ ఆర్థిక వనరులపై కూడా ఈ రహదారి సమస్య తీవ్ర ప్రభావం చూపుతోంది. రైతులు తాము పండించిన పంటలను సకాలంలో మార్కెట్కు తరలించలేకపోతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి రావడం, లేదా పంటలు పాడైపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### ఎన్నికల హామీలకే పరిమితం..!

ఎన్నికలు రాగానే నాయకులు వచ్చి రోడ్లు వేస్తాం, వంతెనలు కడతాం అని రంగురంగుల హామీలు గుప్పిస్తారు. ఓట్లు వేసి గెలిపించిన తర్వాత అసలు ఈ గ్రామం ఉందనే విషయమే మర్చిపోతున్నారు" అని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని వారు వాపోతున్నారు.

### అంబులెన్స్ రాలేదు.. చదువులు సాగవు!

రామ్ భావ్ చవాన్, గ్రామస్తుడు అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు గ్రామానికి అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఉంది. గర్భిణీలు, వృద్ధులను ఆసుపత్రికి తరలించాలంటే నరకం కనిపిస్తోంది. చిన్న పిల్లలు ప్రతిరోజూ బురదలో, వాగుల్లో నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. వర్షం ఎక్కువగా ఉంటే పిల్లలు చదువులకు దూరమవ్వాల్సి వస్తోంది.

### తక్షణమే స్పందించాలి: గ్రామస్తుల డిమాండ్

పిప్పర్గొంది గ్రామాభివృద్ధికి రహదారే ప్రధాన ఆధారమని, రవాణా సౌకర్యం మెరుగైతేనే విద్య, వైద్యం, ఉపాధి రంగాలు మెరుగవుతాయని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గ్రామానికి అన్ని కాలాల్లో ఉపయోగపడే విధంగా నాణ్యమైన సీసీ లేదా బీటీ రహదారిని నిర్మించి, ప్రయాణానికి ఆటంకంగా మారిన వాగులు, ఒర్రెలపై వెంటనే హైలెవెల్ వంతెనలను నిర్మించాలని, ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ప్రత్యేక నిధులు కేటాయించాలి.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, పిప్పర్గొంది గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని, తమ దశాబ్దాల నాటి కష్టాల నుంచి విముక్తి ప్రసాదించాలని గ్రామ ప్రజలు తక్షణ చర్యల కోసం విజ్ఞప్తి చేస్తున్నారు.



# రికార్డులు పారదర్శకంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, పెంచికల్ పేట్:** గ్రామపంచాయతీలో ఏ నిధులు వినియోగించిన రికార్డులు పారదర్శకంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పంచాయతీ రికార్డులు, వివిధ ప్రభుత్వ పద్దుల కింద గ్రామపంచాయతీకి వచ్చిన నిధుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి గ్రామపంచాయితీల ద్వారానే జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, గ్రామాలలో ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతినిత్యం ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త లను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, ప్రయోజనకరమైన చెత్తను వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించాలని తెలిపారు. గ్రామాలలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, పగటిపూట విద్యుత్ దీపాలు వెలుగకుండా నియంత్రికలను బిగించి విద్యుత్ ఆదా చేయాలని, గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఇంటి పనులు 100 శాతం వసూలు చేయాలని, పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రతి లావాదేవీని పారదర్శకంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల పనులు వేగవంతం అయ్యేలా పాలకవర్గం సమన్వయంతో దృష్టి సారించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఒక రైతు విద్యుత్ సరఫరా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఏఐసీసీ నేషనల్ టాలెంట్ హంట్ ఇంటర్వ్యూలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మీడియా, కమ్యూనికేషన్స్ విభాగం చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్లోని ఇందిరా భవన్లో నిర్వహించిన ఏఐసీసీ నేషనల్ టాలెంట్ హంట్ ఇంటర్వ్యూలు బుధవారం ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లే సమర్థులైన డిజిటల్ యోధులను ఎంపిక చేసేందుకు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. గత నాలుగు రోజులుగా అభ్యర్థుల నమోదు ప్రక్రియ కొనసాగగా, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ యువ నాయకులు, సీనియర్ నాయకులు, సోషల్ మీడియా వారియర్లు ఆధార్, ఓటర్ ఐడీ, వ్యక్తిగత ప్రొఫైల్లు, రెజ్యూమ్లతో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా యువజన కాం గ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ ఇంటర్వ్యూకు హాజరై తన ప్రతిభను ప్రదర్శించారు. అలాగే రామగుండానికి చెందిన శ్రీనివాస్, నిజామాబాద్కు చెందిన సాయి రెడ్డి, పురుషోత్తం, సిద్దిపేటకు చెందిన ప్రశాంత్, కృష్ణారెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు. సామ రామ్మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందం అభ్యర్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సోషల్ మీడియా పరిజ్ఞానం, రాజకీయ అవగాహన, ప్రజలతో మమేకమయ్యే సామర్థ్యాన్ని పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించింది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో ఇలాంటి టాలెంట్ హంట్ కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, ఇంటర్వ్యూల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ను జిల్లా పబ్లిసిటీ కోఆర్డినేటర్గా నియమించాలని నిర్ణయించినట్లు సామ రామ్మోహన్ రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ చేయనున్నట్లు వివరించారు.

# అర్హులందరి వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** సర్ ప్రక్రియలో అర్హులందరి వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని గ్రామ ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ అన్నారు. మండలంలోని జంగం గ్రామంలో చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. గ్రామంలోని పలు వార్డులను సందర్శించి సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సర్వే సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరాలంటే సర్వేలో నమోదు చేసే సమాచారం ఖచ్చితంగా ఉండడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు తదితర అవసరమైన పత్రాలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఎవరూ సర్వేకు దూరంగా ఉండకుండా ప్రతి కుటుంబం తమ వివరాలను నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ సర్వే విజయవంతంగా పూర్తయ్యేలా గ్రామపంచాయతీ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది, గ్రామ నాయకులు హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి





## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, పెంచికల్ పేట్:** ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచి కరమైన, పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలాను పరిశీలించి విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వంటగది, కం ప్యూటర్, సైన్స్ ల్యాబ్ లను సందర్శించి విద్యార్థులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ఇంకుడు గుంత పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలాన్ని చదును చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలో పేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. పాఠశా లలలో విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకో వాలని, తరచుగా పాఠశాలకు గైర్హాజరు అయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేయా లని, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. వ ర్షాకాలం అయినందున విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు, సం బంధిత అధికారులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

# పేపర్ మిల్లు గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ పేపర్ మిల్లు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 57వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పేపర్ మిల్లు ఎంప్లాయీస్ ప్రొటెక్షన్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోలెం వెంకటేశం దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నిర్వహణ విషయంలో యాజమాన్యం ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తూ యాజమాన్యం మొండి వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. రేపటి నుంచి జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలతో పాటు వివిధ నిరసన కార్యక్రమాలు చేప ట్టనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రిలే నిరాహార దీక్షలో పి.శ్రీనివాస్, జానకిరామ్, నీలి రాజన్న కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కల్లూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తన్నీరు పోశం, చిలుముల వెంకటేశ్వర్లు, బి.శంకర్, ఎం.లక్ష్మణ్, తిరుపతి తదితర నాయకులు, కార్మికులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

# జంగం–ఆశపల్లి సరిహద్దులో కుంగిన కల్వర్టు

- ప్రయాణికుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు
- భారీ గుంతతో ప్రమాదకరంగా మారిన రహదారి
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలం జంగం–ఆశపల్లి గ్రామాల సరిహద్దులో ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిని కుంగిపో వడంతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. కల్వర్టు పక్కభాగం పూర్తిగా కూలిపోవడంతో భారీ గుంత ఏర్పడి, వాహనదారులు, పాదచారులు భయాందోళనలకు గురవు తున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుండా ప్రతినిత్యం జంగం, ఆశపల్లి గ్రామాల ప్రజలతో పాటు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు కూడా ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టు దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే ఆందోళన ప్రజల్లో నెలకొంది.



### హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు లేక అవస్థలు..

ప్రమాదకరంగా మారిన ఈ ప్రాంతంలో ఇప్పటివరకు ఎలాంటి హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయకపోవడం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మార్చిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు గుంతను గుర్తించలేక ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. కనీసం తాత్కాలిక రక్షణ చర్యలు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి అత్యవసర నిధులతో కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని, శాశ్వతంగా పునర్ నిర్మాణం చేసి రాకపోకలను సురక్షితంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నానో ఎరువులు వినియోగించాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నేలలో తేమ లేకపోవడంతో రైతులు సాంప్రదాయ పద్ధతుల్లో ఎరువులు వేయకుండా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నానో ఎరువులను వినియోగించాలని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం తాంసి మండలంలోని పలు వ్యవసాయ క్షేత్రాలు, ఎరువుల దుకాణాలను సందర్శించి రైతులతో మాట్లాడి సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేలలో తేమ లేని పరిస్థితుల్లో సాధారణ ఎరువులు వేయడంతో మొక్కలకు ఆశించిన ప్రయోజనం లభించదని తెలిపారు. దీంతో మొక్కల ఆకులపై నేరుగా స్ప్రే చేసే నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను ఉపయో గించడం ఉత్తమమని పేర్కొన్నారు. డీఏపీ ఎరువు కొరత ఉంటే ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులను వినియోగించవచ్చని, భాస్వరం అవసరమైతే సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడాలని అన్నారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, వ్యవసాయంపై అవగాహనతోనే ఈ సూచనలు చేస్తున్నానని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలను పాటిస్తూ ఆధునిక సాంకేతికతతో సాగు చేయాలని కోరారు. భవిష్యత్తులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువులను ఉపయో గించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ, మార్కెట్ కమిటీ సభ్యుడు ధనుంజయ్, తాంసి మాజీ ఎంపీటీసీ నరేష్, ఉప సర్పంచ్ గంగారెడ్డి, రామన్న యాదవ్, రఘురెడ్డి, అశోక్, రవి, చిన్నారాములు, నరేష్ పంతులు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం సొనాల మండలం పార్డీ(బి) గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల వంటగది, భోజనశాల, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న భోజనం, మెనూ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలోని



బోర్వెల్ నీటి నాణ్యతను టీడీఎస్ మీటర్తో పరీక్షించి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారం అందేలా అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని మరింత సమర్థ వంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు నిర్వహించి వారి పఠన సామర్థ్యం, అభ్యాసన నైపుణ్యాలను కలెక్టర్ స్వయంగా పరీక్షించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ మల్లేష్, ఎంపీడీఓ రత్నాకర్, ఉపాధ్యాయులు రాజన్న, శేఖర్, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థి దశ నుంచే బాధ్యతలను స్వీకరించే అలవాటు పెంపొందించుకోవాలని, అదే వారిని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దు తుందని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని నారాయణ ఈ–టెక్నో స్కూల్లో నిర్వహించిన "ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించింది. అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యార్థి కేబినెట్ సభ్యులకు బ్యాడ్జ్లు తొడిగి బాధ్యతలను అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇన్వెస్టిచర్ కార్యక్రమం అనేది కేవలం బ్యాడ్జ్లు ధరించే వేడుక మాత్రమే కాదని, తోటి విద్యార్థులు, పాఠశాల పట్ల బాధ్యతలను స్వీకరించే ఒక విలువైన ప్రక్రియ అని పేర్కొన్నారు. విద్యార్థులు నిజాయితీ, క్రమశిక్షణ, వినయం, సేవాభావం వంటి విలువలను అలవర్చుకుని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పాఠశాలకు, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం కామినేని ప్రసాద్, ప్రిన్సిపాల్ స్వర్ణలత, జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి, డీజీఎం వెంకటరమణ రెడ్డి, ప్రత్యేక అతిథులు కరిపె నరేష్ కుమార్, భూపతి కళ్యాణి, గంజి వరలక్ష్మి , ఆర్ అండ్ డీ విభాగం ప్రతినిధులు బైరి అశోక్ కుమార్, గడ్డం వనిత, ఉమా సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చు తగ్గించి అధిక లాభాలు పొందవచ్చని ఏఈఓ రాజేంద్ర నేత అన్నారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకం కింద ఎంపికైన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు బుధవారం జైనూర్ మండలంలోని జంగాప్ గ్రామంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెందూర్ అనుసయా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ మార్కెట్లో ఖరీదైన రసాయన ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయకుండా, ఆవుపేడ, గోమూత్రం, వృక్ష కషాయాలతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసి వినియోగించే విధానాలను వివరించారు. రసాయన ఎరువుల అధిక వినియోగంతో నేల సారం దెబ్బతింటోందని, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలలో సేంద్రీయ కర్బనం పెరగడంతో పాటు వానపాములు వంటి మిత్రజీవులు వృద్ధి చెందుతాయని తెలిపారు. దీంతో భూమి సారవంతంగా మారి పంటల దిగుబడి మెరుగుపడుతుందని చెప్పారు. విషపూరిత రసాయనాలు లేకుండా పండించిన పంటలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ఇలాంటి ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్తో పాటు అధిక ధర లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా నీటి వినియోగం తగ్గడంతో పాటు భూగర్భ జలాలు కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని వివరించారు. ఈ పథకం కింద ఎంపికైన 125 మంది రైతులను "ప్రకృతి వ్యవసాయ బ్రాండ్ అంబాసిడర్లు"గా తీర్చిదిద్ది, వారు గ్రామంలోని ఇతర రైతులకు మార్గదర్శ కులుగా నిలిచేలా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీఆర్పీ అంజన, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆటలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని కోరుతూ బుధవారం తాండూర్ మేజర్ గ్రామపంచాయతీలో రైతులు, యువకులు సాంప్రదాయ బద్ధంగా కప్పతల్లి ఆటలు ఆడారు. సరైన వర్షాలు లేక ఇటీవల విత్తనాలు నాటిన రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వరుణ దేవుడు కరుణ కోసం గ్రామంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మృగశిరకార్తె ముగిసినప్పటికీ నేటివరకు వర్షాలు సరిగా పడకపోవడంతో వ్యవసాయం సమృద్ధిగా అభివృద్ధి చెందాలని కప్పతల్లి ఆటలు ఆడారు. తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని భారేవాడ, కాపువాడ, ఎన్టీఆర్ కాలనీ, హనుమాన్ నగర్, బ్రాహ్మణవాడ, గంగపుత్ర కాలనీల గుండా తిరుగుతూ డప్పు వైద్యాలతో నృత్యాలు చేస్తూ కప్పతల్లిని ఊరేగించారు. మహిళలు వారికి మంగళహారతులతో స్వాగతం పలుకుతూ కప్పతల్లిపై బిందెలతో నీటిని పోశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులు కప్పతల్లి దేవతకు మొక్కలు చెల్లించుకున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ మామిడాల లలిత రాజేశం అన్నారు. తాండూర్ మండలం రాజీవ్నగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు 70 శాతం ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ పూర్తయిందని అధికారులు తెలిపారు. మిగిలిన ఫారాల సేకరణను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయాలని బీఎల్ఓలు, బీఎల్ఏలకు సూచించారు. ప్రజలు కూడా సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి, రాజీవ్నగర్ ఉప సర్పంచ్ కాపార్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సాంకేతిక లోపాలకు అధికారుల బాధ్యత ఎలా..?

- ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదుపై జారీ చేసిన షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థుల హాజరు నమోదు (ఎఫ్ఆర్ఎస్) ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలకు మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని పీఆర్టీయూ టీజీ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 80 శాతానికి పైగా ఉన్నప్పటికీ, నెట్వర్క్ సమస్యలు, సర్వర్ లోపాలు, యాప్ సాంకేతిక ఇబ్బందుల కారణంగా హాజరు పూర్తిస్థాయిలో నమోదు కావడం లేదని తెలిపారు. సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా, ఒకేరోజు నమోదైన హాజరు శాతాన్ని ప్రమాణంగా తీసుకుని మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. సమస్యల మూల కారణాలను గుర్తించి ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థలోని సాంకేతిక లోపాలను పరిష్కరించాల్సింది పోయి అధికారులపై బాధ్యత మోపడం సరైన విధానం కాదని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవడంతో పాటు ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థలోని సాంకేతిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులుగా అశోక్ కుమార్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్గా సేవలందిస్తున్న డాక్టర్ ఎం.అశోక్ కుమార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జ్ పర్యవేక్షకులుగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ ఆసుపత్రి సేవల ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "విద్యా ప్లస్"తో ప్రభుత్వ పాఠశాలలలో విప్లవాత్మక బోధన విధానం

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన అభ్యాసాన్ని అందించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "విద్యా ప్లస్" కార్యక్రమం విద్యార్థి కేంద్రిత, సాంకేతిక ఆధారిత బోధన విధానంతో ముందుకు సాగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తో కలిసి సందర్శించి విద్యా ప్లస్ యాప్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదిలో చివరి బెంచ్‌లో కూర్చున్న విద్యార్థికి కూడా పాఠం పూర్తిగా అర్థమయ్యేలా విద్యా ప్లస్ యాప్‌ను రూపొందించడం జరిగిందని, విద్యార్థులు పూర్తిగా నేర్చుకునే వరకు బోధన కొనసాగడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. డిజిటల్ బోధనకు విద్యా ప్లస్ వేదికగా పనిచేస్తుందని, ఈ యాప్ ద్వారా ఉపాధ్యాయులు తరగతి గదిలోని ఐ.ఎఫ్.పి. డిజిటల్ స్క్రీన్ సహాయంతో పాఠాలను బోధిస్తారని, పాఠం ముగిసిన వెంటనే స్క్రీన్‌పై బహుళైచ్ఛిక ప్రశ్నలు ప్రదర్శించబడతాయని, విద్యార్థులు తమ వద్దనున్న క్యూఆర్ కోడ్ బుక్ ద్వారా సరైన సమాధానాన్ని ఒకేసారి తరగతి గదిలో ఏర్పాటు చేసిన సి.సి. కెమెరాల వైపు చూపిస్తారని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే ఈ కెమెరాలు క్షణాల్లోనే విద్యార్థులందరి సమాధానాలను స్కాన్ చేసి ఫలితాలను నమోదు చేస్తాయని వివరించారు. విద్యా ప్లస్ యాప్‌లో విద్యార్థులు ఆశించిన స్థాయిలో మార్కులు సాధించినప్పుడే తదుపరి అధ్యాయం అన్‌లాక్ అవుతుందని, ఒకవేళ మెజారిటీ విద్యార్థులు తక్కువ మార్కులు సాధిస్తే, ఆ పాఠం వారికి పూర్తిగా అర్థం కాలేదని యాప్ గుర్తించి, అదే పాఠాన్ని ఉపాధ్యాయులు మళ్లీ బోధించవలసి ఉంటుందని తెలిపారు. విద్యార్థులందరూ నిర్దేశిత స్థాయిలో ప్రతిభ కనబరిచే వరకు తదుపరి అధ్యాయం లాక్‌లోనే ఉంటుందని తెలిపారు. ఈ విధానం ద్వారా ఏ ఒక్క విద్యార్థి కూడా వెనుకబడకుండా చూసే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని అంచనా వేయడంతో పాటు, ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు ఎంత మేరకు చేరుతోందో కూడా సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు విద్యా ప్లస్ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించడంలో విద్యా ప్లస్ యాప్ కీలకంగా మారనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో చైర్పర్సన్ బండారి అనూష జన్మదిన వేడుకలు

- రోగుల సహాయకులకు అన్నదానం
- ఆదివాసీ విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రిమ్స్ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అన్నదానం, కుమురం భీమ్ కాలనీలోని ఆదివాసీ విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి జన్మదినాన్ని సేవా దృక్పథంతో జరుపుకున్నారు. ముందుగా రిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన శ్రీ సత్యసాయి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బండారి అనూష సతీష్ దంపతులు చికిత్స పొందుతున్న రోగుల అటెండర్లకు స్వయంగా అన్నదానం చేశారు. అనంతరం కుమురం భీమ్ కాలనీలోని ఆదివాసీ పిల్లలకు ఫుడ్ ప్యాకెట్లను పంపిణీ చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదే కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన చైర్పర్సన్ దంపతులు విద్యార్థులకు మౌలిక విద్యా సదుపాయాలు తగినంతగా లేవని గుర్తించారు. వెంటనే స్పందించి తమ సొంత నిధులతో స్కూల్ బ్యాగులు, నోట్బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. పాత బ్లాక్బోర్డు స్థానంలో ఆధునిక వైట్బోర్డును ఏర్పాటు చేసి విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. జన్మదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ కాలనీల్లో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు చైర్పర్సన్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

# తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ లీజు సాధన

- 13 ఏళ్ల నిరీక్షణకు తెర.. కార్మికుల్లో వెల్లివిరిసిన ఆనందం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషితో చారిత్రాత్మక విజయం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సింగరేణి చరిత్రలో సరికొత్త మైలురాయిగా నిలిచిన తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధన విజయోత్సవ వేడుకలు సత్తుపల్లి ఏరియా పరిధిలో బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక పట్టుదల, ప్రజా ప్రభుత్వ నిరంతర కృషి ఫలితంగా 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడుతూ తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు మంజూరు కావడంతో సింగరేణి కార్మికులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం మార్నింగ్ షిఫ్ట్ ప్రారంభ సమయంలో 7 గంటల నుంచి 7.30 గంటల వరకు జేవీఆర్ ఓసీ, జేవీఆర్ సీహెచ్పీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ డిస్పెన్సరీలలో కార్మికులు, అధికారులు భారీ సంఖ్యలో పాల్గొని ఘనంగా సంబరాలు నిర్వహించారు. జేవీఆర్ ఓసీలో పీఓ ఎన్.ఆర్. ప్రహ్లాద్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీఆర్ సీహెచ్పీలో భూక్యా రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ సోమశేఖర రావు పాల్గొన్నారు. కిష్టారం ఓసీలో పీఓ ఎల్ఎవిస్వి. సునీల్ వర్మ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీఆర్ డిస్పెన్సరీలో డాక్టర్ బి.నరసింహారావు అధ్యక్షతన వైద్య సిబ్బంది విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి జీఎం కార్యాలయంలో ఏరియా హెచ్ఓడీలు, అధికారులు, కార్యాలయ సిబ్బందితో కలిసి విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులను ఉద్దేశించి పంపిన ప్రత్యేక స్ఫూర్తిదాయక సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. అనంతరం కార్మికులకు డిప్యూటీ సీఎం సందేశంతో కూడిన కరపత్రాలు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యంతో 45 సంవత్సరాల పాటు సింగరేణికి ఉజ్వల భవిష్యత్తును అందించడంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి ఇంధన భద్రత కల్పించడంలో తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కీలకపాత్ర పోషించనుందని అధికారులు పేర్కొన్నారు. తాడిచర్ల–2 కేటాయింపుతో పాటు భవిష్యత్తులో కోయగూడెం, సత్తుపల్లి వంటి మరిన్ని బొగ్గు బ్లాకులను సింగరేణికి తీసుకొస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ పట్ల సింగరేణి కార్మిక లోకం హర్షం వ్యక్తం చేసింది. తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ లీజు సాధన సింగరేణి ప్రస్థానంలో చారిత్రాత్మక విజయంగా నిలిచిపోతుందని కార్మికులు పేర్కొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వైద్యాధికారులకు సూచించారు. బుధవారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలకు తగిన అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్తో కలిసి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. తదుపరి మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించారు. ఈనెల 24వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తుల పరిష్కార పురోగతిని సబ్ కలెక్టర్ మనోజ్తో కలిసి సమీక్షించి పలు సూచనలు చేశారు. తర్వాత కాసిపేట మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి నిర్మాణంలో ఉన్న అదనపు గదులు, భోజనశాల, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వంటశాలను సందర్శించి మధ్యాహ్న భోజనానికి వినియోగించే నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఆహార తయారీలో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# విద్యార్థు లు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

**జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా**

. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి లక్ష్యసాధన దిశగా శ్రద్ధ గా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం సొనాల మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం వేళ రాగిజావ వంటి పౌష్టికాహారాన్ని అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు రాగిజావ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జంక్ ఫుడ్స్, చిప్స్ వంటి అనారోగ్యకరమైన ఆహారాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థు ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పాఠశాలలో గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో వచ్చే ఫిర్యాదులను హెచ్ఎంతో కలిసి కమిటీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థు ల్లోవ్యక్తిత్వ వికాసం పెంపొందించే లక్ష్యంతో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రముఖ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్.శంకరన్ వంటి మహనీయుల జీవిత విశేషాలను పాఠ్యాంశాల్లో చేర్చినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లను కేవలం విద్యాభ్యాసం కోసం మాత్రమే వినియోగించాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం డీఆర్డీఓ సహకారంతో న్యూట్రి గార్డెన్లు, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.



అలాగే సొనాల మండలంలో కొత్త ఎంఆర్ఓ కార్యాలయ భవన నిర్మాణాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలో గ్రంథాలయం, న్యూట్రి గార్డెన్ను ప్రారంభించి మొక్క నాటి నీరు పోశారు. అలాగే కంప్లైంట్ బాక్స్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఎంఆర్ఓ మల్లేష్, ఎంపీడీఓ రత్నాకర్ రావు, ఎంఈఓ హుస్సేన్, సర్పంచ్ బిందుజ, ప్రధానోపాధ్యాయులు సచిన్, విద్యాశాఖ సిబ్బంది అజయ్, వీడీసీ సభ్యులు తుల శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు

- **ఉషాని లావణ్యకు న్యాయం చేయాలి**



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతల మానేపల్లి మండలం బాలాజీ అంకోడ గ్రామానికి చెందిన ఉషాని లావణ్య అనే ప్రతిభావంతురాలికి జరిగిన అన్యాయం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఈ ఘటన నేటికీ పేదరికం, అధికార దుర్వినియోగం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థు లు ఎలా నష్టపోతున్నారో స్పష్టంగా చూపిస్తోంది. నిరుపేద అయిన లావణ్య తండ్రి సత్తయ్య గొర్రెలు, మేకలు కాస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు ఆడ పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్నాడు. లావణ్య ఇంటర్మీడియట్లో 92 శాతం మార్కులతో ఫస్ట్ క్లాస్లో ఉత్తీర్ణత సాధించి తన ప్రతిభను చాటుకుంది. పై చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉన్నప్పటికీ, కుటుంబ ఆర్థి క పరిస్థితులు అనుకూలించకపోవడంతో తండ్రికి తోడుగా గొర్రెలు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఇంటర్ మెరిట్ ఆధారంగా విద్యా వాలంటీర్ నియామకాలకు అవకాశం కల్పించింది. మెరిట్ ప్రకారం 92 శాతం మార్కులు సాధించిన లావణ్యకే మొదటి ప్రాధాన్యత దక్కాల్సి ఉండగా, ఆమె కంటే తక్కువగా 88 శాతం మార్కులు సాధించిన మరో అభ్యర్థి కి అవకాశం కల్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ, అధికార ప్రభావంతో ఈ అన్యాయం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో లావణ్య కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది. ఎంతో కష్టపడి కుమార్తెను చదివించినప్పటికీ ప్రతిభకు తగిన గుర్తింపు దక్కకపోవడంతో తండ్రి సత్తయ్య తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇది కేవలం ఒక విద్యార్థి నికి జరిగిన అన్యాయం మాత్రమే కాదు. ప్రతిభ ఉన్నప్పటికీ పేదరికం, సామాజిక వెనుకబాటు, అధికార ప్రభావం కారణంగా అవకాశాలు కోల్పోతున్న వేలాది మంది విద్యార్థుల పరిస్థితికి ఇది ప్రతీకగా నిలుస్తోంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, సంబంధిత విద్యా శాఖ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, మెరిట్కు అనుగుణంగా ఉషాని లావణ్యకు న్యాయం చేయాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**అదనపు కలెక్ట ర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం భీమారం మండలంలోని మద్దికల్ గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను మండల తహశీల్దార్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దికల్ గ్రామంలో మొత్తం 853 సర్వే నంబర్ల పరిధిలో 4,810 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ముగ్గురు లైసెన్స్డ్ సర్వేయర్లు, ఒక సర్వేయర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో రీ సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రైతులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా స్పష్టమైన భూ రికార్డులు, మ్యాపులు రూపొందించ వ చ్చని పేర్కొన్నారు. అనంతరం భీమారం మండలంలోని ఆరెపల్లి గ్రామం, మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి అంకుశాపూర్ గ్రామంలోని సమతా అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును తహశీల్దార్తో కలిసి పరిశీలించారు. మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా అందజేయాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ (ఆదిలాబాద్):** రైతులు తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం పొందేలా నానో ఎరువుల వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం సొనాల మండల కేంద్రంలో పర్యటించిన ఆయన ఎరువుల విక్రయ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించడంతో పాటు నూతన మండల విద్యాశాఖ కార్యాలయం, ప్రీప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. ముందుగా శ్రీ సాయిబాబా ఫెర్టిలైజర్స్ దుకాణం, గోదామును పరిశీలించి ఎరువుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ ఎరువులతో పోలిస్తే నానో యూరియా, నానో డీఏపీ రైతులకు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయని తెలిపారు. రైతుల్లో నానో ఎరువులపై విస్తృత అవగాహన కల్పించి వాటి వినియోగాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వివిధ విభాగాలు, మందుల నిల్వలు, వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఉద్యానవన నిర్వహణను అభినందిస్తూ సిబ్బందిని ప్రశంసించారు. తదుపరి సొనాల గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను





పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారాలను తప్పులు లేకుండా పూర్తి చేయాలని, ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని బీఎల్ఓలు, సూపర్వైజర్లను ఆదేశించారు. ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులు గ్రామపంచాయతీకి అందజేసిన పునర్వినియోగ భోజన ప్లేట్లను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన మండల విద్యాశాఖ కార్యాలయం, ప్రీప్రైమరీ పాఠశాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రీప్రైమరీ విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, తహశీల్దార్ మల్లేష్, ఎంపీడీఓ రత్నాకర్, మండల విద్యాధికారి ఉస్సేన్, నవీన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి దేవా, ఫెర్టిలైజర్స్ దుకాణ నిర్వాహకుడు శ్రవణ్ కుమార్, సర్పంచ్ బిందుజ, వీడీసీ చైర్మన్ శ్రీనివాస్, బీఎల్ఓలు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రెండు చోట్ల ఓటు ఉన్న సీఎంపై చర్యలు తీసుకోవాలి

- **త్వరలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుస్తాం**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండడం చట్ట విరుద్ధమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవనున్నట్లు తెలిపారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండడం నేరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొడంగల్, కొండారెడ్డిపల్లి ప్రాంతాల్లో ఓటు హక్కు ఉన్నట్లు తెలిపారు. కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్లో ఈ విషయాన్ని వెల్లడించారా అని ప్రశ్నించారు. అలాగే కొండారెడ్డిపల్లిలోని ఓటు తొలగిస్తే, దానికి సంబంధించిన ఫారం-7, ఫారం-8పై ముఖ్యమంత్రి స్వయంగా సంతకం చేశారా అనే విషయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఈ వ్యవహారంపై స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఫ్యాక్ట్ చెక్ సంస్థల పాత్ర ఏమిటని, గతంలో విడుదల చేసిన వివరణను ఎందుకు తొలగించారో స్పష్టం చేయాలని కోరారు. సినీ నటుడు ప్రకాశ్ రాజ్, మీనాక్షి నటరాజన్ విషయంలో ఒక విధంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలాగే నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ మీడియాను బెదిరించడాన్ని తప్పుబట్టారు. ఆర్టికల్-14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానమేనని, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలోనే ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్లనున్నట్లు వివరించారు.

# టీజీవీపీ బిక్కనూరు మండల, కళాశాల కమిటీల నియామకం

**విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపు..**




**ఉద్యమ కెరటం,బిక్కనూరు :**
తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆధ్వర్యంలో బిక్కనూరు జిల్లా కేంద్రంలో మండల కమిటీ, కళాశాల కమిటీలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ నూతన కమిటీలను ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థు ల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం టీజీవీపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నూతనంగా బిక్కనూరు మండల కమిటీ ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి ఎండీ సమీర్ పాల్గొన్నారు.మండల అధ్యక్షుడిగా దేవుని భరత్, ఉపాధ్యక్షుడిగా విజయ్, మహిళా మండల అధ్యక్షురాలిగా శ్రీనిధి, ఉపాధ్యక్షురాలిగా అంకితను ఎంపిక చేశారు. కళాశాల అధ్యక్షుడిగా శ్రీవర్ధన్, ఉపాధ్యక్షుడిగా మనదీప్, ఇన్చార్జిగా కార్తీక్, మహిళా కళాశాల అధ్యక్షురాలిగా షిరీన్, ఉపాధ్యక్షురాలిగా మహాలక్ష్మి , కళాశాల ఇన్చార్జిగా నిరక్షణను నియమించినట్లు గంధం సంజయ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, విద్యార్థినులు, టీజీవీపీ మండల కమిటీ కార్యకర్తలు

# గురుకుల కళాశాలను సందర్శించిన ఎంఈఓ రాజా గంగారెడ్డి

**భోజన నాణ్యత, వసతులపై తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం...**




**ఉద్యమ కెరటం,బిక్కనూర్:**
కామారెడ్డి జిల్లా బిక్కనూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పాఠశాలను బుధవారం మధ్యాహ్నం మండల విద్యాధికారి (ఎంఈఓ) రాజా గంగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొవిజన్ రూమ్, బియ్యం నిల్వలు, టాయిలెట్ బ్లాక్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం విద్యార్థు లతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థు లు,ప్రిన్సిపాల్ ఎస్. రఘుతో మాట్లాడి భోజన నాణ్యత, వసతులపై ఆరా తీయగా అన్నీ సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. రఘు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థు లు పాల్గొన్నారు..

# ఫ్రాన్స్‌ను మట్టికరిపించిన స్పెయిన్



**టెక్సాస్, జూలై 15 (ఉద్యమ కెరటం):** ఫిఫా ప్రపంచకప్-2026లో స్పెయిన్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌ను 2-0 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో స్పెయిన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత మరోసారి ఫైనల్‌లో అడుగుపెట్టడం స్పెయిన్‌కు ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన స్పెయిన్‌కు 22వ నిమిషంలో పెనాల్టీ లభించింది. యువ ఆటగాడు లామిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీ ఇచ్చారు. ఆ అవకాశాన్ని మికెల్ ఒయర్‌జాబల్ సద్వినియోగం చేసుకుని తొలి గోల్ నమోదు చేశాడు. అనంతరం 58వ నిమిషంలో డానీ ఓల్మోతో చక్కటి పాస్‌ల మార్పిడి అనంతరం పెడ్రో పోరో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ ఆధిక్యాన్ని 2--0కు పెంచాడు. ఫ్రాన్స్ తరఫున కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలే, మైఖేల్ ఒలిసే వంటి స్టార్ ఆటగాళ్లు బరిలో ఉన్నప్పటికీ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయారు. స్పెయిన్ డిఫెన్స్ ముందు ఫ్రాన్స్ దాడులు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో వరుసగా మూడో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు గల్లంతయ్యాయి. 14 ఏళ్లుగా జట్టును నడిపిస్తున్న కోచ్ డిడియర్ డెషాంప్స్‌కు ఈ ఓటమి నిరాశ మిగిల్చింది. విజయం అనంతరం స్పెయిన్ ప్రధాన కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె జట్టు సమష్టి ప్రదర్శనను ప్రశంసించాడు. ఫ్రాన్స్ బలమైన దాడులను సమర్థంగా అడ్డుకోవడంలో ఆటగాళ్లు విజయవంతమయ్యారని పేర్కొన్నాడు. ఆదివారం న్యూజెర్సీలోని న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా-ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

# హర్మన్ గైర్హాజరీలో కెప్టెన్సీకి సిద్ధం

## స్మృతి మంధాన



**లండన్, జూలై 15 (ఉద్యమ కెరటం):** భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో జట్టును నడిపించేందుకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన స్పష్టం చేసింది. ఎన్నో ఏళ్లుగా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ నాయకత్వానికి అవసరమైన అనుభవాన్ని సంపాదించానని, అవకాశం వస్తే జట్టు పగ్గాలు చేపట్టేందుకు ఏమాత్రం వెనుకాడబోనని వెల్లడించింది. ఇంగ్లండ్‌పై లార్డ్స్ మైదానంలో జరిగిన ఏకైక టెస్టులో భారత్ చారిత్రక విజయం సాధించిన అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. హర్మన్‌ప్రీత్ స్థానంలో కెప్టెన్సీ చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే ప్రశ్నకు స్పందించిన స్మృతి, "అవును.. నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. హర్మన్ అందుబాటులో లేకపోతే జట్టుకు నాయకత్వం వహించేందుకు ఎలాంటి సందేహం లేదు" అని స్పష్టం చేసింది. జట్టులో బాధ్యతలు పంచుకోవడం ప్రతి ఆటగాడి కర్తవ్యమని, నాయకత్వ బాధ్యతలు వచ్చినప్పుడు వాటిని సమర్థంగా నిర్వర్తించేందుకు తాను సిద్ధంగా ఉంటానని పేర్కొంది. ఇటీవల లార్డ్స్‌లో జరిగిన తొలి మహిళల టెస్టు మ్యాచ్‌ను స్మృతి ప్రత్యేకంగా గుర్తు చేసుకుంది. ఆ చారిత్రక వేదికపై భారత్ తరఫున ఆడటం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా నిలిచిందని తెలిపింది. "ప్రతి క్రికెటర్‌కు టెస్టు క్రికెట్ ఆడాలనేది ఒక కల. అలాంటి మ్యాచ్‌ను లార్డ్స్ వంటి చారిత్రక మైదానంలో ఆడటం మరింత ప్రత్యేకం. అంతేకాదు, ఆ మ్యాచ్‌లో జట్టు విజయంలో నేను కూడా కీలక పాత్ర పోషించడం ఎంతో ఆనందంగా ఉంది" అని చెప్పింది. ఆ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలు నమోదు చేసి భారత్ విజయంలో స్మృతి కీలక పాత్ర పోషించింది. నాయకత్వ పరంగా కూడా స్మృతి మంధానకు మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు ఆమె భారత మహిళల జట్టుకు 18 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు, నాలుగు వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించింది. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 15 విజయాలు అందించి తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించింది. ముఖ్యంగా ఆమె సారథ్యంలో భారత్ ఆడిన నాలుగు వన్డేల్లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఓటమి చవిచూడకపోవడం విశేషం. ఈ గణాంకాలు భవిష్యత్తులో పూర్తి స్థాయి నాయకత్వ బాధ్యతలు చేపట్టే సామర్థ్యం తనకు ఉందనే విషయాన్ని మరోసారి చాటుతున్నాయి.

# డబ్ల్యూటీసీకి సెమీ ఫైనల్స్

## ఐసీసీ కీలక ప్రతిపాదనలు




**ఎడిన్‌బర్గ్, జూలై 15 (ఉద్యమ కెరటం):** అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ, ఉత్కంఠ పెంచే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్స్‌ను ప్రవేశపెట్టడం, వన్డే ప్రపంచకప్‌లో జట్ల సంఖ్యను తగ్గించడం, కొత్త టోర్నీ విధానాలను అమలు చేయడం వంటి పలు ప్రతిపాదనలు ఐసీసీ వార్షిక సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం రెండేళ్ల చక్రంలో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాయింట్ల పట్టికలో తొలి రెండు జట్లు మాత్రమే ఫైనల్‌కు చేరుతున్నాయి. అయితే టోర్నీపై మరింత ఆసక్తి పెంచేందుకు ఇకపై తొలి నాలుగు జట్ల మధ్య సెమీఫైనల్స్ నిర్వహించి, విజేతలను ఫైనల్‌కు పంపే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మార్పు అమల్లోకి వస్తే డబ్ల్యూటీసీ మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వే జట్లను కూడా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో చేర్చేందుకు ఐసీసీ వర్కింగ్ గ్రూప్ కసరత్తు చేస్తోంది. టెస్ట్ క్రికెట్ విస్తరణకు ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. వన్డే ప్రపంచకప్‌లో కూడా మార్పులు ప్రతిపాదించారు. ప్రస్తుతం 14 జట్లతో నిర్వహిస్తున్న టోర్నీని 12 జట్లకు పరిమితం చేయడంతో పాటు 'సూపర్ సెవెన్' పేరుతో కొత్త దశను ప్రవేశపెట్టాలని ఐసీసీ పరిశీలిస్తోంది. 2027లో దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా నిర్వహించే ప్రపంచకప్ నుంచే ఈ మార్పులు అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే టీ20 ప్రపంచకప్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న 'సూపర్ ఎయిట్' దశను 'సూపర్ టెన్'గా మార్చే అంశంపైనా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన మహిళా శరణార్థ క్రికెటర్లకు ఐసీసీ అండగా నిలిచింది. వారి కోసం రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించిన మండలి, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను పునర్వ్యవస్థీకరించింది. 2030 నాటికి ఐసీసీ అర్హత టోర్నీల్లో ఈ మహిళా క్రికెటర్లు పాల్గొనేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించే బాధ్యతను ఆ బృందానికి అప్పగించింది. ఈ టాస్క్‌ఫోర్స్‌లో ఇప్పటికే భారత క్రికెట్ నియంత్రణ మండలి, క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు ప్రతినిధులు ఉండగా, తాజాగా ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ రోస్ రివాజ్, ఐసీసీ ప్రధాన కార్యనిర్వాహకుల కమిటీ సభ్యురాలు సారా కీన్‌లను కూడా చేర్చింది. మహిళా శరణార్థ క్రికెటర్లకు సమాన అవకాశాలు, ప్రాతినిధ్యం, పోటీ వాతావరణం కల్పించడమే ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యమని ఐసీసీ వెల్లడించింది.

# జపాన్ ఓపెన్‌లో భారత షట్లర్లకు ఎదురుదెబ్బ

**టోక్యో, జూలై 15 (ఉద్యమ కెరటం):** జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లకు నిరాశ ఎదురైంది. ప్రతిష్ఠాత్మక టోర్నీ తొలి రౌండ్‌లోనే స్టార్ షట్లర్లు లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి ఓటమి పాలై నిష్క్రమించారు. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు ముందు కీలక సన్నాహక పోటీగా భావించిన ఈ టోర్నీలో భారత జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ గాయాల కారణంగా పోటీ నుంచి తప్పుకోవడం భారత శిబిరాన్ని మరింత నిరాశకు గురిచేసింది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ పద్నాలుగో ర్యాంకర్ లక్ష్య సేన్‌కు జపాన్‌కు చెందిన కోకి వతనాబే షాక్ ఇచ్చాడు. ఆరంభ గేమ్‌లో లక్ష్య పోటీ ఇచ్చినా కీలక సమయంలో వరుస తప్పిదాలు చేయడంతో 21-16 తేడాతో గేమ్‌ను కోల్పోయాడు. రెండో గేమ్‌లో వతనాబే దూకుడుగా ఆడి శక్తివంతమైన స్మాష్‌లతో లక్ష్యపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. కేవలం 38 నిమిషాల్లోనే 21-14తో రెండో గేమ్‌ను కూడా గెలిచి వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. దీంతో ఈ సీజన్‌లో నిలకడ కోసం ప్రయత్నిస్తున్న లక్ష్య మరోసారి నిరాశతోనే టోర్నీకి వీడ్కోలు పలికాడు. మరో యువ భారత షట్లర్ ఆయుష్ శెట్టి థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్లావుట్ విటిడ్సార్న్‌కు గట్టి పోటీ ఇచ్చినా విజయాన్ని అందుకోలేకపోయాడు. తొలి గేమ్‌ను స్వల్ప తేడాతో కోల్పోయిన ఆయుష్, రెండో గేమ్‌లో ప్రత్యర్థి సాధించిన ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని అద్భుతంగా గెలిచి పోరును నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. అయితే చివరి గేమ్‌లో అదే జోరును కొనసాగించలేక 21-19, 23-25, 21-15 తేడాతో పరాజయం పాలయ్యాడు. గంటా 22 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ అభిమానులను ఉత్కంఠకు గురిచేసింది. మహిళల సింగిల్స్‌లోనూ భారత్‌కు ఆశించిన ఫలితం రాలేదు. ప్రపంచ ఇరవై నాలుగో ర్యాంకర్ ఉన్నతి హుడా చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ యు-హ్సున్ చేతిలో మూడు గేమ్‌ల పోరులో ఓడిపోయింది. తొలి గేమ్‌ను గెలిచిన ఉన్నతి తర్వాతి రెండు గేమ్‌లలో ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేక 21-16, 16-21, 15-21 తేడాతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే భారత అభిమానులకు కొంత ఊరటనిచ్చేలా స్టార్ షట్లర్ పీవీ సింధు తొలి రౌండ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు 21-14, 21-11 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు జపాన్ ఓపెన్‌లో భారత ఆశలన్నీ సింధుపైనే నిలిచాయి.





# అర్జెంటీనాపై వివాదం

## తొలగించాలని లక్షలాది సంతకాలతో పిటిషన్

**న్యూయార్క్, జూలై 15 (ఉద్యమ కెరటం):** ఫిఫా ప్రపంచకప్-2026 సెమీఫైనల్‌కు ముందు డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వివాదంలో చిక్కుకుంది. జట్టుకు రిఫరీలు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్జెంటీనాను ప్రపంచకప్ నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ 75 లక్షల మందికిపైగా సంతకాలతో ఒక ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ అంశం ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పిటిషన్‌లో ఫిఫా, రిఫరీలు లియోనెల్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా జట్టుకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపించారు. విజేతను ముందుగానే నిర్ణయిస్తే మిగతా జట్లు ఎందుకు పోటీపడాలని ప్రశ్నిస్తూ, అన్ని జట్లకు సమాన అవకాశాలు కల్పించాలంటే అర్జెంటీనాను టోర్నీ నుంచి తొలగించాలని అందులో కోరినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ ఆరోపణలపై ఫిఫా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అలాగే పిటిషన్‌లో చేసిన ఆరోపణలకు స్వతంత్రంగా ఎలాంటి ఆధారాలు వెలుగులోకి రాలేదు. ఇదిలా ఉండగా సెమీఫైనల్‌లో అర్జెంటీనా, ఇంగ్లండ్ జట్లు తలపడనున్నాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌లో ఈ రెండు జట్ల మధ్య పోటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. దక్షిణ అట్లాంటిక్‌లోని ఫాక్‌ల్యాండ్ దీవులు (అర్జెంటీనా భాషలో మాల్వినాస్) వివాదం కారణంగా ఇరు దేశాల మధ్య రాజకీయ విభేదాలు ఉన్న నేపథ్యంలో, ఆ ప్రభావం ఫుట్‌బాల్ మైదానంలోనూ తరచూ కనిపిస్తూ ఉంటుంది. ప్రత్యేకంగా 1986 ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్‌లో డిగో మారడోనా సాధించిన వివాదాస్పద 'హ్యాండ్ ఆఫ్ గాడ్' గోల్ ఇప్పటికీ అర్జెంటీనా-ఇంగ్లండ్ పోరాటాల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. ఇప్పుడు మరోసారి ప్రపంచకప్ సెమీఫైనల్‌లో ఈ రెండు జట్లు తలపడుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల దృష్టి ఈ మ్యాచ్‌పైనే నిలిచింది. అయితే అర్జెంటీనాపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఫిఫా లేదా టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు.



ఉద్యమ కెరటం UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక




## ప్రభాస్ అంటే.. మాంచి భోజనం గుర్తుకొస్తుంది

### హీరోయిన్ పూజా హెగ్డే ఆసక్తికర వ్యాఖ్య

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు. ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.



## వారణాసి కోసం..

### రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది



## వాటిపై సమంతకు మక్కువ

**హైదరాబాద్, జూలై 15 (ఉద్యమ కెరటం):** టాలీవుడ్ ప్రముఖ నటి సమంత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకుంటున్న మార్పులు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వంట చేయడం పెద్దగా రాదని, ఎక్కువ సమయం చిత్రీకరణలకే కేటాయించేదానినని చెప్పిన సమంత.. ఇప్పుడు సంప్రదాయ వంటకాలపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి చెందిన సంప్రదాయ వంటకాలను నేర్చుకుంటూ, వాటి తయారీలో సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. సన్నిహితుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం సమంత ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతూ రాయలసీమకు ప్రత్యేకమైన ఘాటు రుచులు, సంప్రదాయ మసాలాలతో చేసే వంటకాల తయారీని నేర్చుకుంటున్నారట. స్వయంగా వంటలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ, కొత్త వంటకాలపై అవగాహన పెంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు వంటగదికి దూరంగా ఉండే ఆమె ఇప్పుడు కిచెన్‌లో సమయం గడపడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల ఆమె జీవితంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా కుటుంబంతో ఎక్కువ సమయం గడిపే అవకాశం లభించిందని, ఈ సమయంలో గతంలో నేర్చుకోలేని విషయాలపై దృష్టి సారిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బయట కార్యక్రమాలను తగ్గించి విశ్రాంతి తీసుకుంటున్న సమంత, ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు సమాచారం. ఇంట్లో తయారయ్యే పోషకాహారంతో కూడిన సంప్రదాయ వంటకాలనే ఎక్కువగా నేర్చుకుంటున్నారని ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. తెలుగు కుటుంబంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్వాత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక వంటకాలపై సమంతకు మరింత ఆసక్తి పెరిగిందని కూడా ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా రాయలసీమ వంటకాల ప్రత్యేక రుచిని ఆమె ఎంతో ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల కోసం స్వయంగా వంట చేసి వడ్డించడం ద్వారా ఆమె కొత్త అనుభూతిని ఆస్వాదిస్తున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం'చిత్రంలో కుటుంబానికి అండగా నిలిచే ఇంటి కోడలి పాత్రలో సమంత ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అదే తరహాలో నిజ జీవితంలోనూ కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతూ, సంప్రదాయ వంటకాలను నేర్చుకోవడం ద్వారా తన జీవితంలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్నారని అభిమానులు చర్చించుకుంటున్నారు

## 'టాక్సిక్' నుంచి మరో పాటకు సిద్ధం



**హైదరాబాద్, జూలై 15 (ఉద్యమ కెరటం):** దక్షిణాది సినీ ప్రేక్షకులతో పాటు ఉత్తరాది అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో కథానాయకుడు యశ్ నటిస్తున్న 'టాక్సిక్' ఒకటి. ప్రముఖ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన ప్రచార చిత్రాలు, పాత్రల పరిచయ పోస్టర్లు, ఇటీవల విడుదలైన 'తబాహి' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. తాజాగా ఈ చిత్ర సంగీతానికి సంబంధించిన మరో ఆసక్తికర సమాచారం వెలుగులోకి వచ్చింది. సంగీత దర్శకుడు విశాల్ ప్రస్తుతం అమెరికాలోని కాలిఫోర్నియాలో సంగీత కార్యక్రమంలో పాల్గొంటూనే 'టాక్సిక్' చిత్రంలోని మరో పాట స్వరరచన పనుల్లో నిమగ్నమయ్యారు. తన సామాజిక మాధ్యమ ఖాతాలో సంగీత రూపకల్పన జరుగుతున్న దృశ్యాన్ని పంచుకుంటూ, చిత్రంలోని నాలుగో పాటపై పని చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమాచారం బయటకు రావడంతో త్వరలోనే కొత్త పాట విడుదలయ్యే అవకాశం ఉందంటూ అభిమానులు ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'తబాహి' పాటలో యశ్, కియారా అద్వానీ మధ్య కనిపించిన నృత్యం, తెరపై వారి అభినయం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అదే స్థాయిలో రాబోయే పాట కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, విశాల్ వెల్లడించిన తాజా సమాచారం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. భారీ యాక్షన్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యశ్ రెండు భిన్నమైన పాత్రల్లో కనిపించనున్నట్లు ప్రచారం సాగుతోంది. అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీతో పాటు పలువురు విదేశీ నటీనటులు కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లాతో కలిసి విశాల్ కూడా కొన్ని పాటలకు సంగీతం అందించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ ఛాయాగ్రాహకుడు రాజీవ్ రవి చిత్రీకరణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 26న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**